**జరిగిన కథ :** నాగరాజు వల్ల పితృదత్తకు పుట్టిన ఫణిదత్తుడు.. మల్లయోధుడయ్యాడు. కాశీగంగలో మునిగి, పాతాళానికి వెళ్లాడు. వరుణకన్యకలకు బంధవిముక్తి కల్పించాడు. మిత్రుల దారిద్ర్యాన్ని పోగొట్టడానికి.. శశాంకవతి అనే రాజకన్యను రక్షించాడు. ఆమె అతణ్ని ప్రేమించింది. ఫలితంగా గర్భవతి అయింది. రాచనగరు నుంచి ఆ జంట తప్పించుకుపోతుండగా.. దారిమధ్యలో శశాంకవతిని ఎవరో ఎత్తుకుపోయారు.






# మలుపు తిరిగిన జీవితం

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

ఫణిదత్తుడు కొద్దిదూరం వెళ్లేసరికే.. శశాంకవతిని ఎత్తుకుపోతున్న సైన్యం కనిపించింది. నేర్పుగా ఆ సైన్యంలోకి చొచ్చుకుపోయాడు ఫణిదత్తుడు. శత్రువు గుర్రం సమీపానికి తన గుర్రాన్ని లంఘించి, వాణ్ని ఒక్క తన్ను తన్నాడు. ఆ రౌతు కిందపడగానే ఆ గుర్రాన్ని తానెక్కి, రెప్పపాటులో ఆ సమూహం నుంచి ఈవలకు వచ్చాడు. వచ్చేటప్పుడు కిందపడిన రౌతును విడిచిపెట్టకుండా గుర్రపు కాలిగిట్టల చేత తొక్కించడం వల్ల వాడు మరణించాడు. అప్పటికే చీకటి పడుతూ ఉండటంతో.. ఈ సంగతి వారెవరూ గుర్తించలేదు.

ఆ చీకట్లోనే ఫణిదత్తుడు తన గుర్రాన్ని చాలాదూరం నడిపించాడు. అపాయం పూర్తిగా తప్పిందని నిర్ధారణ అయినాక ఒకచోట ఆగి.. శశాంకవతికి బడలిక తీర్చాడు. తెల్లవారింది లగాయతు.. వారి ప్రయాణం మొదలైంది. ఈసారి మళ్లీ చీకటిపడేలోగా.. అడవి దాటాలని మొండిగా ప్రయత్నించాడు ఫణిదత్తుడు. కానీ, ఎంత దూరం వెళ్లినా ఆ అడవికి తుదిమొదలు కనిపించలేదు. ఆ ఇద్దరినీ పగలంతా మోసిమోసి చాలాదూరం పరుగెత్తడం వల్ల ఆ గుర్రం అలిసిపోయి.. ఒకచోట నేలపై పడి, గిలగిలా కొట్టుకుని ప్రాణాలు విడిచింది.

అప్పటికింకా జాము పొద్దుంది. ఇక ఆ పూటకు వారక్కడే ఉండాలని నిశ్చయించుకున్నారు. శశాంకవతికి దాహం కావడంతో ఫణిదత్తుడు ఒక చెట్టెక్కి చూశాడు. దగ్గరలోనే ఒక తటాకం ఉన్నట్లు గమనించి, చెట్టుదిగి..

''నేను వచ్చేదాకా జాగ్రత్తగా ఉండు!'' అని ఆమెతో చెప్పి.. శంఖం తీసుకుని వెళ్లాడు.

చెరువుకు వెళ్లి శంఖంలో నీళ్లు పట్టుకుని.. తిరిగి వద్దామని చూసేసరికి చీకటి పడింది. చీకట్లో ఫణిదత్తుడు దారి తప్పాడు. రాత్రంతా ఎంత ప్రయత్నించినా.. తాను ఎక్కణ్నుంచి వచ్చాడో తిరిగి అక్కడికి మాత్రం చేరుకోలేకపోయాడు. తెల్లవారిన తరువాత కూడా అతని ప్రయత్నమంతా వ్యర్థమే అయింది. సుడిగుండంలో పడ్డ కట్టెలా.. పోయిన చోటికే పోతూ, చూసిన తావునే చూస్తూ శశాంకవతిని కలుసుకోలేక మూడురోజులపాటు నానా యాతన పడ్డాడు. చివరికి తామెక్కివచ్చిన గుర్రం చనిపోయిన చోటును కనిపెట్టగలిగాడు. ఏదో జంతువు తినేయగా.. దాని ఎముకలు మాత్రం కనిపించాయి. అది చూస్తూనే..

''హా! శశాంకవతీ!'' అని అరిచాడు ఫణిదత్తుడు.

ఆ ప్రాంతమంతా కలియతిరిగాడు. అయినా ఫలితం లేకపోయింది. ఆమె కనిపించలేదు. తన చేతిలోని శంఖాన్ని నీరు కిందికిపోకుండా ఇసుకనేలలో ఒకచోట గుచ్చి.. పక్కనే ఉన్న మద్దిచెట్టెక్కి చూడసాగాడు.

అంతలో అక్కడికి కొందరు కిరాతులు వచ్చారు. వారి నాయకుడు శంఖాన్ని పైకి తీసి చూస్తుండగా ఫణిదత్తుడు చెట్టుదిగి వచ్చాడు.

''ఇది నా శంఖం. నాకిచ్చెయ్!'' అని లాక్కోబోయాడు.

ఆ శబర నాయకుడు దానిని ఇవ్వకుండానే..

''నువ్వెవరు? ఇక్కడికెలా వచ్చావు?'' అని అడిగాడు.

''నేను, నా భార్య ఈ దారిన పోతుండగా నీటికోసం వెళ్లి.. ఆమెతో విడిపోయాను. ఆమె నీకెక్కడైనా కనిపిస్తే చెప్పగలవా?'' అని అడిగాడు ఫణిదత్తుడు.

''అయ్యో! ఆమె నీ భార్యేనా? ఎవరో అనుకున్నాను. పాటలీపుత్రానికి దారి అడిగితే చెప్పాను. ఆమె వెళ్లినదారి నాకు బాగా తెలుసు. నువ్వు వీళ్లవెంట మా ఇంటికి పో. నేను నీ భార్యను తీసుకొచ్చి అప్పగిస్తాను'' అన్నాడు శబర నాయకుడు.

''అయితే నా శంఖం నాకిచ్చెయ్యి'' అని అడిగాడు ఫణిదత్తుడు.

''నేను తెస్తాలే పో! నీ భార్యకు ఆనవాలుగా చూపవద్దూ!'' అన్నాడు శబరుడు.

సరేననుకుని ఫణిదత్తుడు కొందరు కిరాతులతో కలిసి, వాళ్ల గూడేనికి వెళ్లాడు. ఆ రాత్రికి అతిథి మర్యాదలు చక్కగా జరిగాయి. తెల్లవారి నిద్రలేచి చూసుకునేసరికి కాళ్లకు సంకెళ్లు తగిలించి ఉన్నాయి.

దాంతో ఫణిదత్తుడు..

'అయ్యో మోసపోయాను. నా గ్రహచారం బాగోలేదు కాబోలు. ఆపదల మీద ఆపదలు వస్తున్నాయి' అనుకున్నాడు.

ఆరోజంతా అతనికి భోజనం లేదు. మరునాడు ఆహారం పట్టుకుని ఒక కన్య వచ్చింది. ఆమె తనను